పలుచోట్ల రైతుల్లేక వెలవెల

## సిగ్నల్ ప్రాబ్లం.. రైతు నేస్తానికి అంతరాయం



నర్సింహులపేట : జయపురం రైతు వేదికలో రైతులు లేకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు



బయ్యారం: రామచంద్రాపురంలో సిగ్నల్ లేక ఖాళీగా ఉన్న పరికరాలు

నర్సింహులపేట/బయ్యారం, జూన్ 16 : సిగ్నల్ సమస్య తలెత్తడంతో రైతునేస్తం కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. సోమవారం రైతు నేస్తం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖికి ఏర్పాట్లుచేయగా మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మర్రిగూడెం, కోమట్లగూడెం, బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామాల రైతు వేదికల్లోని అనుసంధాన పరికరాలకు సిగ్నల్ అందలేదు. సమస్యకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని డీఏఓ విజయనిర్మల తెలిపారు. అలాగే రైతునేస్తం కార్యక్రమానికి పలుచోట్ల స్పందన కరువైంది. కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలున్నప్పటికీ నర్సింహులపేట మండలం జయపురంలో ఎక్కువగా ఖాళీ కుర్చీలే కనిపించాయి.

## రీపోస్టింగ్ ఆర్డర్ కోసం లంచం



ఏసీబీ అధికారులకు పట్టుబడిన డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్‌యాదవ్

- ఏసీబీకి చిక్కిన ములుగు డీఈవో
- ఉపాధ్యాయుడి నుంచి రూ. 20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ జేఏ
- వివరాలు వెల్లడించిన వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

ములుగు, జూన్16(నమస్తేతెలంగాణ) : విద్యార్థులను సక్రమ మార్గంలో భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన డీఈవో వక్ర మార్గంలో పయనిస్తూ విద్యా శాఖకు చెడ్డ పేరు తీసుకొచ్చిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. రీపోస్టింగ్ ఆర్డర్ కోసం ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు 2024 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదానికి గురై అక్టోబర్ వరకు సెలవులో ఉన్నాడు. అక్టోబర్ 1వ తేదీన పాఠశాలలో రిపోర్టు చేయగా, మూడు నెలలైనందున డీఈవోకు సరెండర్ చేశామని, అక్కడ రిపోర్టు చేయమని హెడ్‌మాస్టర్ చెప్పాడు. అదేరోజు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా, డీఈవో గార్ల పాణిని రూ.20 వేలు లంచంగా ఇస్తేనే రీపోస్టింగ్ ఆర్డర్ ఇస్తానన్నాడు. ఆర్డర్ తయారు చేసినందుకు జూనియర్ అసిస్టెంట్ తొట్టె దిలీప్‌కుమార్‌యాదవ్ రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో స్కూల్ ఓపెన్ అయిన తర్వాత ఈ నెల 12వ తేదీన సదరు ఉపాధ్యాయుడు కార్యాలయానికి వెళ్లి తాను డబ్బులు ఇచ్చుకోలేనని, తనకు జీతం కూడా రావడం లేదని ప్రాధేయపడినప్పటికీ డీఈవో పాణిని వినలేదు. చివరికి బ్రతిమిలాడగా తనకు రూ. 15వేలు, దిలీప్‌కు రూ.5వేలు ఇవ్వాలని చెప్పాడు. సదరు ఉపాధ్యాయుడికి లంచం ఇవ్వడం ఇష్టం లేక వరంగల్‌లోని ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఆయన ఫిర్యాదు మేరకు సోమ వారం డీఈవోకు ఇచ్చే రూ.15వేలతో పాటు తనకు వచ్చే రూ.5వేలను జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ ఉపాధ్యాయుడి నుంచి తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఫైల్ మూమెంట్ తనిఖీ చేస్తే ఫిబ్రవరిలోనే ఉపాధ్యాయుడి జాయినింగ్ ఆర్డర్ తయారు చేశాడని, డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఆర్డర్‌ను వారి వద్దనే ఉంచుకొని ప్రస్తుతం లంచం తీసుకొని ఇచ్చేందుకు ప్రయత్నించారని అన్నారు. డీఈవో పాణిని, జూనియర్ అసి స్టెంట్ దిలీప్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని, నేడు వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064 లేదా 9154388912కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ దాడుల్లో అధికారులు ఎస్ రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, రాత్రి 10 గంటలు దాటినా ఇంకా ఏసీబీ అధికారుల విచారణ కొనసాగుతున్నట్లు తెలిసింది.

### వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట..



చినుకు జాడ లేకపోవడంతో వర్షాలు కురువాలని చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా రోకలికి కట్టిన వస్త్రంలో కప్పను ఉంచి ఇల్లిల్లూ తిరుగగా మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి కప్పతల్లి తడిసేలా నీళ్లు పోయడంతో పాటు చిన్నారులపై నీళ్లు పోశారు. ఈ సందర్భంగా 'వాన దేవుడో వాన దేవుడా.. వానల్లు కురవాలి వాన దేవుడా' అంటూ పాటలు పాడారు. కప్ప తల్లికి నీళ్లు పోస్తే వానదేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తాడని.. చిన్నారుల కప్పతల్లి ఆటలతోనైనా వర్షాలు పడాలని, పంటలు పండాలని గ్రామస్తులు కోరుతున్నారు. - జఫర్‌గఢ్, జూన్ 16



హనుమకొండ కలెక్టరేట్‌లోని కాకతీయ తోరణాన్ని తాకినట్లుగా ఉన్న కారుమబ్బులు
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



రామన్నగూడెం పుష్కరఘాట్ ఎగువ ప్రాంతంలో కోతకు గురవుతున్న ఒడ్డు

## వరద భయం.. కానరాని అభయం..

గోదావరికి వరదొస్తే ప్రమాదమే..

- ప్రవాహ తాకిడికి కరకట్టకు ముప్పే..
- నిధులు మంజూరైనా నిర్మాణంలో జాప్యం
- కోతకు గురవుతున్న ఒడ్డు, తీర ప్రాంతం
- కనిపించకుండా పోతున్న పంట భూములు
- మునిగిపోనున్న పరీవాహక గ్రామాలు
- ప్రజలను వెంటాడుతున్న గత జ్ఞాపకాలు

ఏటూరునాగారం, జూన్ 16 : గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను వానకాలం భయం వెంటాడుతున్నది. 2022 జూలైలో వచ్చిన వరద ఏటూరునాగారం మండల కేంద్రాన్ని ముంచెత్తింది. దీంతో ప్రజలు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లి తలదాచుకున్నారు. ఈసారి వర్షాలు ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇక గోదావరి కరకట్టకు పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించేందుకు అధికారులు అప్పటికప్పుడు ఇసుక బస్తాలు నింపి అడ్డువేసే ప్రయత్నం ఏటా కొనసాగుతున్నది. వరదొస్తే నీటి పారుదలశాఖ అధికారులకు సవాల్‌గా మారుతున్నది. ఏటూరునాగారం చుట్టూ గోదావరి కరకట్ట ఉన్నప్పటికీ వరద ముంపు తప్పలేదు. అలాగే చాలా కాలంగా కరకట్ట ఒడ్డు, తీరం కోతకు గురవుతుండడంతో మంగపేట మండలంలోని పంట భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. పుష్కరతీరం కూడా కోతకు గురవుతున్నది. వీటి నుంచి ప్రజలను కాపాడేందుకు భరోసా ఇవ్వాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. 2022లో గోదావరి కరకట్ట నిర్మాణం, కట్ట పటిష్టత కోసం రూ. 137 కోట్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి టెండర్లు పూర్తిచేసినప్పటికీ నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటికే పూర్తి కావాల్సిన పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. గతేడాది గోదావరి కరకట్ట దెబ్బతినకుండా ఉండేందుకు ఇవే నిధులతో జియో ట్యూబ్ కంటైనర్లను ఏర్పాటు చేసే ప్రతిపాదన తీసుకొచ్చి అంచనా వ్యయాన్ని కూడా తయారు చేసినప్పటికీ వీటికి సంబంధించిన డిజైన్‌కు ఇంకా ఆమోదం లభించనట్లు తెలిసింది. అయితే జియో ట్యూబ్ కంటైనర్ల ఏర్పాటులో భాగంగా ప్రస్తుతం కరకట్ట దెబ్బతిన్న ఒడ్డు వెంట ఇసుక నింపుతుండడంతో పాటు అది కొట్టుకుపోకుండా దానిపై మలేషియా నుంచి తెప్పించిన కార్పెట్ షీట్లు పరుస్తున్నారు. అయితే వరద తాకిడికి రివిట్‌మెంట్లు కొట్టుకుపోయి, గోదావరి తీరం ఉర్లిపోతుంటే ఒడ్డు వెంట నింపిన ఇసుక ఉంటుందా? కార్పెట్ షీట్లు ఉంటాయా? కరకట్టను కాపాడతాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కోతకు గురవుతున్న కరకట్ట

ఏటూరునాగారం–రామన్నగూడెం మధ్యలోని మూల మలుపు వద్ద కరకట్ట పూర్తిగా దెబ్బతినడంతో గతేడాది మరమ్మతు చేశారు. కానీ రివిట్‌మెంట్ చేయలేదు. ఇప్పటికీ ఇదే పరిస్థితి నెలకొంది. అయితే వరద తాకిడికి మరమ్మతు చేసిన కట్ట ఉంటుందా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. 110 మీటర్ల పొడవునా 15 మీటర్ల ఎత్తుతో కరకట్ట మరమ్మతు కోసం రూ. 70 లక్షలు నీటి పారుదలశాఖ ద్వారా కేటాయింపులు జరిగాయి. రామన్నగూడెం పుష్కరఘాట్‌కు ఎగువ ప్రాంతంలోని ఒడ్డు అనేక చోట్ల కోతకు గురైంది. రాంనగర్ నుంచి మంగపేట మండలంలోని అనేక గ్రామాల గోదావరి తీరం కోతకు గురై వందల ఎకరాల భూమి కనిపించకుండా పోతున్నది. దీనిని కట్టడి చేయని పక్షంలో ఏటా ఒడ్డు కోతకు గురై కట్టకు ప్రమాదం సంభవించి వరద గ్రామాల్లోకి వచ్చే ఉంటుంది.

### షట్టర్ల లీకేజీతో ఇబ్బందే..

గోదావరి కరకట్ట, జంపన్నవాగు కాంక్రీటు గోడలకు ఏర్పాటు చేసిన షట్టర్ల లీకేజీతో కూడా ప్రమాదం ఉంది. మూడేళ్ల క్రితం షట్టర్ల నుంచి వచ్చిన వరదే ఏటూరునాగారం మునగడానికి కారణమని, ఏటా మరమ్మతులు చేస్తున్నప్పటికీ వానకాలంలో వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో లీకేజీ తప్పడం లేదు. షట్టర్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కరకట్ట ఒడ్డు కింది భాగంలో ఇసుకు నింపి పర్చిన కార్పెటు షీటు

### జియో ట్యూబ్‌లకు ఆమోదం రావాలి

గోదావరి కరకట్ట వెంట జియో ట్యూబ్‌లు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఆమోదం పొందాల్సి ఉంది. ఇక ఏటూరునాగారం మండలంలో నాలుగు చోట్ల, మంగపేట మండలంలో రెండున్నర కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణం జరగాల్సి ఉంది. మంగపేట మండలంలో కరకట్ట పనులు చేపట్టేందుకు అనుమతి వచ్చింది. ఏటూరునాగారంలో జియో ట్యూబ్ పద్ధతిలో చేసేందుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపించాం. కరకట్టపై ఉన్న షట్టర్లను మరమ్మతు చేయించాం. కోతకు గురవుతున్న ఒడ్డు వెంట ఇసుక నింపుతున్నాం. కరకట్ట కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.
– జగదీశ్, ఈఈ, నీటి పారుదలశాఖ

## ప్రేమజంట ఆత్మహత్య

- పెళ్లికి అమ్మాయి ఇంట్లో అంగీకరించపోవడంతో బలవన్మరణం
- రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతి
- భువనగిరిలో ఘటన.. నమిలిగొండలో విషాదం





మచ్చ శృతి,వినయ్ కుమార్(ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 16 : ఇద్దరి ఇండ్లు ఒకే వీధిలో, చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. కలిసి చదువుకున్నారు. వారి స్నేహం కాస్త ప్రేమగా మారింది. మూడేళ్లుగా ఇద్దరు ప్రేమించుకుంటున్నారు. అమ్మాయి ఇంట్లో వారు పెండ్లికి ఒప్పుకోకపోవడంతో ఆ ప్రేమజంట ఆదివారం రాత్రి ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోటె రాజయ్య–లక్ష్మి దంపతుల కుమారుడు వినయ్ కుమార్(25), మచ్చ కుమార్–రేణుక దంపతుల కూతురు శృతి(23) కుటుంబాలు ఒకే వీధిలో ఉంటాయి. వినయ్‌కుమార్, శృతి చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. వీరి తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుండగా, గ్రామంలో ఇద్దరికి మంచిపేరు ఉంది. అయితే శృతి హైదరాబాద్‌లోని తన అక్క ఇంట్లో ఉంటూ విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నది. అప్పుడప్పుడూ నమిలిగొండకు వచ్చి వెళ్తూ ఉంటుంది. వినయ్‌కుమార్ స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరి ప్రేమ విషయాన్ని అబ్బాయి తల్లిదండ్రులు అంగీకరించగా, అమ్మాయి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఆ అబ్బాయిని వివాహం చేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని మృతురాలి తండ్రి బెదిరించాడు. అంతే కాకుండా అమ్మాయికి కాజీపేటకు చెందిన అబ్బాయిని చూశాడు. ఈ క్రమంలో వినయ్‌కుమార్ తన బైక్‌పై భువనగిరికి వెళ్లగా అక్కడికి శృతి వచ్చింది. ఇద్దరు కలిసి యాదగిరిగుట్టకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడినుంచి భువనగిరి టోల్‌గేట్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం రాత్రి 8–9 గంటల ప్రాంతంలో రైలు కిందపడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని.. వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి ఆందోళన

- ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు
- సముదాయించి కిందకు దింపిన పోలీసులు

పర్వతగిరి, జూన్ 16: అన్ని అర్హతలున్నా తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదని ఓ యువకుడు నిరసనకు దిగాడు. ఊరిలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువు కొమ్ము తండాలో చోటుచేసుకోగా కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన ధరావత్ సుమన్ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో అతడికున్న ఇల్లు కాలిపోయింది. దీంతో తనకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఇటీవల ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అతని పేరు లేదని తెలియడంతో సుమన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చెప్పిన వారికే ఇండ్లు కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే సుమన్ ఊరిలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. తనకు అన్ని అర్హతలున్నా ఇల్లు ఇవ్వలేదని, అనర్హులకు కేటాయించారని మండిపడ్డాడు. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకొని సుమన్‌ను సముదాయించి కిందకు దించడంతో ఊపిరిపీల్చుకున్నారు.





వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ధరావత్ సుమన్‌ను సముదాయిస్తున్న పోలీసులు, స్థానికులు

## చేయిచ్చారు!

పింఛన్ల ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పడేసింది. ఒకటి, రెండు హామీలను అమలు చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నది. ముఖ్యంగా ఆసరా పింఛన్లపై ఇచ్చిన మాటను నెరవేర్చక ఇబ్బందులకు గురి చేస్తున్నది. కొత్త పింఛన్లు మంజూరు చేయక.. ప్రస్తుత లబ్ధిదారులకు పెన్షన్లు పెంచి ఇవ్వక చోద్యం చూస్తున్నది. దీంతో దరఖాస్తుదారులతో పాటు పింఛన్‌దారులు సర్కారుపై మండిపడుతున్నారు. ఏడాదిన్నరగా తమను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి.. అత్యాశకు పోయి ఓట్లేసినందుకు తగిన శాస్తి జరిగిందంటూ వాపోతున్నారు.
– మహబూబాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ)/హనుమకొండ



- కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుదారులు.. పాతవి పెంచి ఇస్తారని లబ్ధిదారులు..
- ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నవైనం..
- పట్టించుకోని రాష్ట్ర సర్కారుపై మండిపాటు

### ఆసరా ఆలస్యం..

అలాగే ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే ప్రస్తుతం ఇస్తున్న రూ. 2,016ను రూ. 4 వేలకు, దివ్యాంగులకు రూ. 4,016 నుంచి రూ. 6 వేలకు పెంచి అందజేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని ఆసరా లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక ఇంట్లో చనిపోయిన వ్యక్తి స్థానంలో అతడి భార్యకు 58 ఏళ్లు నిండితే పింఛన్‌ను భర్తీ చేస్తున్నారు తప్ప కొత్త వాటిని మాత్రం మంజూరు చేయడం లేదు. దీనికి తోడు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు వచ్చేవని, ఇప్పుడు నెల చివరన పంపిణీ చేస్తున్నారని, ఈ డబ్బులపై ఆధారపడిన వారికి ఇబ్బందిగా మారుతున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఆసరా పింఛన్ల విషయమై కాంగ్రెస్ సర్కారు హ్యాండివ్వడంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి 17 నెలలవుతున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒకటి, రెండు పథకాలనే అమలు చేస్తున్న ప్రభుత్వం.. ముఖ్యంగా ఆసరా పింఛన్లను పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 2023 ఆగస్టు వరకు 1,12,395 మందికి రూ. 1,658 కోట్ల పింఛన్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసేది. ఇందులో వృద్ధులు 47,261 మంది, దివ్యాంగులు 15,734, వితంతువులు 42,453, ఒంటరి మహిళలు 3,044, గీత కార్మికులు 3,036, చేనేత కార్మికులు 400, బోదకాలు 378, డయాలసిస్ 74, బీడీ కార్మికులు 15 మంది ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12,000 మంది దరఖాస్తు చేసుకోగా ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేదు. ఇందులో 8,000 మంది వృద్ధులు, మూడు వేల మంది దివ్యాంగులు, మరో వేయి మంది చేనేత, గీత తదితరులున్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో 1,02,520 మందికి ప్రస్తుతం ప్రతి నెలా రూ. 24,19,65,616 ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ జిల్లాలోనూ 8,536 మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని మంజూరు కోసం నిరీక్షిస్తున్నారు. అధికారులు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపించినప్పటికీ పట్టించుకోవడం లేదు. అయితే ఆసరా పింఛన్లకు సంబంధించిన సైట్‌ను ప్రభుత్వం మూసివేసిందని, దానిని తెరవాల్సి ఉందని సంబంధిత అధికారులు అంటున్నారు.

### పింఛనే ఆధారం..



ఆసరా పింఛన్ పైనే ఆధార పడి బతుకుతున్న. నాకు నెలవారీ మందులతో పాటు ఇతర ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. కేసీఆర్ సారు ప్రభుత్వం ఉన్నపుడు ప్రతి నెల 1వ తేదీన పైసలు వచ్చేటియి. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఆలస్యమవుతున్నది. ఒక్కొక్కసారి నెలలు పడుతున్నది. అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు పెంచుతామని చెప్పిండ్రు. రెండేండ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పెంచలేదు. అన్నీ అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసిండ్రు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచాలని కోరుకుంటున్నా.
–ఎస్ మణెమ్మ, జితేందర్‌సింగ్‌నగర్, హనుమకొండ

## నేటి నుంచి టీజీఈసెట్ కౌన్సెలింగ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 16: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో డిప్లొమా విద్యార్థులకు రెండో సంవత్సరం బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 17 నుంచి ప్రారంభమవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదటి దశ కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను టీజీఈసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌గా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌన్సెలింగ్‌కు వచ్చేవారు ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో పాటు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు టీజీఈసెట్ అధికారిక వెబ్‌సైట్ https://tgecet.nic.inను సంప్రదించాలని కోరారు.

**మొదటిదశ షెడ్యూల్**

ప్రాథమిక సమాచారం అప్‌లోడ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్‌బుకింగ్ ఈ నెల 14 నుంచి 18 వరకు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ (స్లాట్ బుక్ చేసిన అభ్యర్థులకే) 17 నుంచి 19 వరకు, ఆప్షన్ల ఎంపిక 17 నుంచి 21 వరకు, ఆప్షన్ల ఫ్రీజింగ్ 21న, సీట్ల తాత్కాలిక కేటాయింపు 25వ తేదీలోపు, ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ 25 నుంచి 29 వరకు ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,013 సీట్లు అందుబాటులో ఉన్నాయని, వీటిలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఫార్మసీ వంటి కోర్సులకు అత్యధికంగా అవకాశాలున్నాయని తెలిపారు.

## బకాయిలు చెల్లించని సింగరేణి

ఓసీ-3లో పనులు నిలిపివేసిన ఏజెన్సీ

నిలిచిన బొగ్గు ఉత్పత్తి, మట్టి తవ్వకాలు

గణపురం, జూన్ 16 : సింగరేణి యాజమాన్యం తమ పాత బకాయిలు చెల్లించాలంటూ ఎస్వీసీ మైనింగ్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ సోమవారం ఓసీ–3లో పనులు నిలిపివేసింది. దీంతో సింగరేణికి భారీ నష్టం వాటిల్లింది. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని పరశురాంపల్లి ఓసీ–3లో ఎస్వీఈసీ మైనింగ్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ బొగ్గు, మట్టి తవ్వకాలు చేస్తున్నది. ఇందుకు సంబంధించి సుమారు రూ. 4 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఏజెన్సీ ఆధ్వర్యంలో పనులు చేస్తున్న కార్మికులు తమకు వేతనాలు ఇవ్వడం లేదని మంగళవారం నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఏజెన్సీ ముందస్తుగా పనులు నిలిపివేసింది. దీంతో 4వేల టన్నుల మట్టి తవ్వకాలు నిలిచిపోవడంతో పాటు 3వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. కాగా, సింగరేణి యాజమాన్యం సంబంధిత ఏజెన్సీకి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అందులో పనిచేసే డ్రైవర్లు, ఆపరేటర్లు, ఇతర కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.